# పార్టీ ప్రతిష్టను ఇనుమడింపజెయ్యండి
# నిందాప్రచారాలకు స్వస్తి చెప్పండి

లోక్‌సత్తా పార్టీ నిర్వహించుకున్న సంస్థాగత ఎన్నికలు భారత రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించింది. ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. 29000 మంది క్రియాశీల సభ్యులు గల పార్టీ 80 నియోజకవర్గాలలో, 15 జిల్లాలలో ఎన్నికలు నిర్వహించుకుంది. దాదాపు 1500 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన ప్రతినిధులు రాష్ట్ర అధ్యక్షుని ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొన్నారు. 450 మంది ఎన్నికైన రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏప్రిల్ 14న జరిగిన సమావేశానికి హాజరై 17 మంది రాష్ట్ర ఆఫీసు బేరర్లను ఎన్నుకున్నారు. ఉదయం 9 గంటల నుండి హైదరాబాద్ ఆర్‌టిసి కళాభవనంలో ఎలాంటి రణ గొణ ధ్వనులు లేకుండా ఎంతో ఆసక్తితో ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓటింగ్ అనంతరం 3 నుండి 4-30 గంటల వరకు జరిగిన సమావేశంలో ప్రతినిధులంతా పాల్గొని జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుని ప్రసంగాలు ఆసక్తిగా విన్నారు. కొత్త ఉత్తేజాన్ని పొందారు. హర్షాతిరేకాలు ప్రకటించారు. జనరల్ కౌన్సిల్ సభ్యులలో 50 శాతం యువత జిల్లా, నియోజకవర్గ స్థాయిలలో నాయకత్వం పొందిన వారున్నారు. పెద్ద సంఖ్యలో  ఎన్నికైన మహిళలు వచ్చారు. సుదూర ప్రాంతాల నుండి ఎంతో వ్యయప్రయాసల కోర్చి రావడం పార్టీ ఎన్నికల పట్ల వున్న ప్రగాఢ విశ్వాసానికి అద్దంపట్టింది.

ఈ  సంస్థాగత ఎన్నికలలో మరో ప్రత్యేకత వుంది. ఒక స్వతంత్ర ఎన్నికల అథారిటీ యీ ఎన్నికలను నిర్వహించింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన దగ్గర నుండి అందులో ప్రకటించిన తేదీలు, పద్ధతిని తు.చ తప్పకుండా పాటించారు. జిల్లా నియోజకవర్గ స్థాయిలలో పార్టీ సభ్యులు కానివారిని, ఎన్నికలలో  అనుభవం గల ప్రభుత్వ శాఖలలో, స్వచ్ఛంద సంస్థలలో పనిచేసిన వారిని నియామకం చేశారు. ఒక పార్టీ ఎన్నికలు ఇలా జరగాలి అన్న రీతిలో నిర్వహించారు. అందుకే ఈ ఎన్నికల తీరు చూసి పత్రికలు అబ్బురపడ్డాయి. కొత్త రాజకీయ సంస్కృతికి ద్వారాలు తెరుచుకున్నాయని ప్రశంసలు కురిపించాయి. టెలివిజన్  ఛానళ్లు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. రాష్ట్ర రాజకీయాలలో, పార్టీలలో ఇది చర్చనీయాంశం అయింది. ఈ ఎన్నికల ద్వారా పార్టీ తెచ్చుకున్న ప్రతిష్టను మనం ఇనుమడింపచెయ్యాలి.  సంప్రదాయ పార్టీల డొల్లతనాన్ని ఎండగట్టాలి. ప్రజల హృదయాలలో మనం స్థానం సంపాదించుకోవాల్సిన తరుణం ఇది.

దీనికి భిన్నంగా వ్యవహరించడం పార్టీకి తీరని హాని కలిగిస్తుంది. ఎలాంటి ఎన్నికల వ్యవస్థలోనైనా కొన్ని లోపాలు, పొరపాట్లు వుంటాయి. ప్రస్తుతం మనకు వచ్చిన అనుభవాల ఆధారంగా భవిష్యత్తులో అవి పునరావృత్తం కాకుండా చక్కదిద్దుకోవాలి. ఎన్ని లోటుపాట్లు ఉన్నా అంతర్గత ప్రజాస్వామ్యం ప్రయోగానికి మరో ప్రత్యామ్నాయం లేదు. పార్టీ అంతర్గత ఎన్నికలలో గెలుపు ఓటములు ప్రత్యర్థి పార్టీల మధ్య వుండే తీరుగా ఆలోచించకూడదు. ఇక్కడ గెలుపు పార్టీ సభ్యుల సాపేక్షమైన అభిప్రాయం మాత్రమే. వ్యతిరేక అభిప్రాయం కాదు. ఎన్నికల తర్వాత అంతా ఒకటిగా కలిసి పనిచెయ్యాల్సిందే.  ఇందులో వ్యక్తిగత ద్వేషాలకు తావు వుండకూడదు. పార్టీ సభ్యుల తీర్పును స్వీకరించడం, వారి విశ్వాసాన్ని చూరగొనేలా పనిచెయ్యడం లక్ష్యంగా వుండాలి. కాని దురదృష్టవశాత్తూ ఎన్నికల ఘట్టం పూర్తయిన తర్వాత కూడా కొందరు పార్టీ నాయకత్వం మీద పేర్లు పెట్టి మరీ నిందాప్రచారం చేస్తున్నారు. దీనికి ఫేస్‌బుక్‌లనూ, ఇ-మెయిల్స్‌ని సాధనాలుగా చేసుకుని విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు.

కొందరు ప్రస్తావిస్తున్న అంశాలు వాస్తవాలకి పొంతనలేనివిగా వున్నాయి. ఉదాహరణకి  ఒక పక్క రాష్ట్ర ఆఫీసుబేరర్లకు ఓటింగ్ జరుగుతుండగానే మరోపక్క అదే హాలులో జాతీయ అధ్యక్షుడు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని పరిచయం చెయ్యడం సరైనదేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. రాష్ట్ర ఆఫీసుబేరర్ల ఓటింగ్ ప్రక్రియ1 గంటతో ముగిసింది. జనరల్ కౌన్సిల్ సమావేశం 3 గంటలకు ప్రారంభం అయింది. ఏకగ్రీవంగా ఎన్నికైన వారి పరిచయం గం॥ 4-30 ని॥ జరిగింది. ఇది ఓటింగ్ పూర్తయిన తరువాత కౌంటింగ్ జరుగుతున్న దానిపై ఎలాంటి ప్రభావాన్ని చూపదు. కాని  ఒక పక్క ఓటింగ్ జరుగుతుండగానే అంటూ అభూత కల్పనను ప్రచారం చేస్తున్నారు.

మరొకటి పార్టీ ఎన్నికల నియమావళి గురించిన తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది వర్మగారు తమకి అనుకూలంగా రాసుకుని ఉపాధ్యక్ష పదవి దక్కించుకున్నట్లు ప్రచారం చేస్తున్నారు. నిజానికి దీనిని పాండురంగారావు, వర్మగార్లతో కూర్చుని

తుదిరూపం ఇవ్వడం జరిగింది. దానిని రాష్ట్ర కార్యవర్గం చర్చించి ఆమోదించింది. ఇలా ఆమోదం పొందిన తర్వాత అది కార్యవర్గ నిర్ణయమే అవుతుంది తప్ప వ్యక్తులకు దీనిని ఆపాదించడం అనుచితం. పైగా అందరూ ఒకే పద్ధతిలో ఓటింగ్ ద్వారా ఎన్నిక కావాల్సిందే తప్ప దొడ్డిదారిన పదవులు పొందే అవకాశం లేనప్పుడు దీని నుండి ప్రయోజనం పొందారనడం కేవలం నిందారోపణే తప్ప మరొకటి కాదు.

ఇక మాధవ్ సభ్యత్వ నమోదు పర్యవేక్షణ బాధ్యత నుండి తప్పించమని సమావేశాలలోనే కోరారు. ఆ బాధ్యత వేరొకరికి అప్పగించినప్పటికీ మాధవ్ నియమించిన వలంటీర్లతోనే అది కొనసాగించడం జరిగింది. అయితే వారు కీలకమైన సమయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయకుండా తమ బాధ్యతల్ని వదిలిపెట్టిపోయిన తీరు పార్టీ సభ్యత్వ నమోదుకు అనేక చిక్కుల్ని కల్పించింది.

సభ్యత్వ నమోదుకు ఎదురైన ఇబ్బందులు, అందులో ఎదురైన సాంకేతిక కారణాల వల్ల కొందరి పేర్లు జాబితాలో లేకుండాపోయాయి. ఇలాంటి సభ్యులతో అనుబంధ జాబితా తయారైనా, దానిని ఎన్నికల సంఘం ఆమోదం పొందకపోవడంతో ఈ సభ్యులలో కొంత అసంతృప్తి వుండడం సహజం. అయినా వారు పెద్ద మనసుతో పార్టీ చేసిన విజ్ఞప్తిని మన్నించారు.

తప్పనిస్థితిలో సభ్యత్వ కార్యాలయ నిర్వహణ బాధ్యత లక్ష్మణ్‌బాలాజీ, సాంకేతిక సహకార బాధ్యత పద్మగారు చేపట్టవలసివచ్చింది. వీరి కృషికి ప్రశంసలు లేకపోగా ఈ బాధ్యతల వల్లే వారు ఉపాధ్యక్షులు అయ్యారని సభ్యత్వం యాక్సిస్ పొంది కటారి గారు ఎన్నికయ్యారని ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి వీరిని పార్టీ సభ్యులే ప్రత్యక్షంగా ఎన్నుకునే వీలు లేదు. పైగా మొదటి ఇద్దరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నిందాప్రచారం వారి విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నం తప్ప వేరు కాదు.

ఇకపోతే బోగస్ సభ్యత్వం అంటూ ప్రచారాన్ని కొందరు లేవదీశారు. ముందుగా బోగస్ సభ్యత్వం అంటే ఏమిటో నిర్వచించుకోకుండా ఎవరికి తోచిన పద్ధతిలో వారు నిర్ధారణకు రావడం దానికి విస్తృతప్రచారం కల్పించి పార్టీ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలు చేశారు. దీనిపై పరిశీలనకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసి నిర్దిష్ట ఆరోపణలను విచారించి తగు చర్యలు తీసుకుంటామని ప్రకటించినా ఈ ప్రచారాన్ని కొందరు ఇప్పటికీ సాగిస్తూనే వున్నారు.

ఇక ఈ రెండేళ్లలో లోక్‌సత్తా పార్టీ కార్యవర్గ సమావేశాలలో చర్చించి నిర్ణయించి అమలు చేసిన ముఖ్య కార్యకలాపాలను ఫార్సు ఉద్యమాలుగా చిత్రీకరించడం అనుమతించరాని అంశం. దాదాపు 60 మున్సిపాలిటీలలో నాయకత్వ శిక్షణ నిధుల సమీకరణ, 6 ఉప ఎన్నికలలో పార్టీ పోటీ చెయ్యడం, రైతు చైతన్య యాత్రలు సదస్సులు, ఉద్యమంలో భాగంగా రెండు చారిత్రాత్మకమైన పాదయాత్రలు, అందువల్ల రైతులకి కలిగిన ప్రయోజనాలు, దాదాపు 4 నెలల పాటు సాగిన సురాజ్య ఉద్యమం అన్నీ మనం గర్వించదగ్గ కార్యక్రమాలు. పార్టీ శ్రేణుల్ని క్రియాశీలం చెయ్యడంలో, ప్రజల్ని, రైతుల్ని ప్రభావితుల్ని చేసిన కార్యక్రమాలు ఇందులో దాదాపు 2000 మంది పార్టీ కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించారు. ఈ కార్యక్రమాల ఫలితంగానే పార్టీ క్రియాశీలక సభ్యత్వం 29000కు పెరిగింది. కొత్త నాయకత్వం యువత పదవులలోకి వివిధ స్థాయిలలో రాగలిగారు.

ఈ కార్యక్రమాలకు దూరంగా వుండి, పార్టీ నిర్ణయాలు అమలు చెయ్యకపోగా వీటిని ఫార్సుగా చిత్రీకరించడం పార్టీకి మంచి చేసేది ఎంత మాత్రమూ కాదు. మన పార్టీ విశ్వసనీయతను దెబ్బతీసి లాభపడాలనే శక్తులు పార్టీ బయట కొన్ని పనిచేస్తున్నాయి. అలాంటి శక్తులకు ఉపకరించే ఇలాంటి ప్రచారాలు పార్టీ లోపల జరగడం విచారకరం. భవిష్యత్తులో పార్టీలో అందరూ కలిసి పనిచేయాల్సిన ప్రయత్నాలకు ఇవి విఘాతం కలిగిస్తాయి.

ఇప్పుడు ఎన్నికలు పూర్తయ్యాయి. ఇక ఇలాంటి వ్యక్తిగత నిందాప్రచారానికి తావు ఇవ్వకూడదు. వెంటనే ఫేస్‌బుక్‌లో, ఇ-మెయిల్స్‌లో ఇలాంటి ప్రచారాన్ని నిలిపివెయ్యాలి. అలా కాకుండా పార్టీ మీద, ఎన్నికైన నాయకత్వం మీద నిందారోపణల ప్రచారాన్ని సాగించడం క్రమశిక్షణారాహిత్యం అవుతుంది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే చర్య అవుతుంది.

ఇలాంటి ప్రచారం సాగుతున్నా, పార్టీ సభ్యులంతా ఈ ఎన్నికలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల తర్వాత పార్టీ ప్రతిష్టను ఇనుమడింపజేశారు. ఇప్పుడు పార్టీ వివిధ స్థాయిలలో కొత్త నాయకత్వంతో, యువత, మహిళల ప్రాతినిధ్యంతో ఒక బలమైన మరింత సంఘటితమైన శక్తిగా అవతరించింది. ఎన్నికైన సభ్యులందరికీ అభినందనలు తెలియజేస్తున్నాను. పార్టీ సభ్యులందరూ పూర్తి ఐక్యతనే ప్రదర్శించాల్సిందిగా కోరుతున్నాను. అభిప్రాయ బేధాలు, విభిన్న ఆలోచనలు ఉంటే, వాటిని

పార్టీలో అంతర్గతంగా చర్చించుకోవాలి తప్ప, బహిరంగంగా పార్టీకి నష్టం కలిగించే చర్చలు చేపట్టటం సరయిన పద్ధతికాదు.

ఇక సంస్థాగత ఎన్నికలలో అనుభవందృష్ట్యా రెండు ప్రధాన అంశాలు పాటించటం అవసరమని తేలింది. మొదటిది: సభ్యత్వ జాబితాలో మరింత మంచి పద్ధతులని పొరపాట్లు జరగకుండా మరింత పారదర్శకంగా, మార్పులు చేర్పులకి సంస్థాగతంగా ఏర్పాట్లు చేయటం అవసరం. సభ్యులు, ఓటర్ల జాబితాలని బహిరంగంగా ఇంటర్నెట్‌లో పెట్టాలన్న ఆలోచన పైన చర్చ జరగాలి. పార్టీ సభ్యుల జాబితాలో కావలసిన సవరింపులకి, దీర్ఘకాలిక ఏర్పాట్లకి దోహదం చేసేందుకు వీలుగా ఓ బృందాన్ని త్వరలో ఏర్పాటు చేయటం జరుగుతుంది.

రెండవది : ప్రతినిధుల ఎన్నికని వికేంద్రీకరించి, ఎక్కడికక్కడ స్థానిక క్రియాశీల సభ్యులకి ప్రాతినిధ్యం ఉండేలా ఏర్పాట్లు అవసరం. దాన్ని లోతుగా అధ్యయనం చేసి ఎన్నికల నిబంధనలని సవరించటం జరుగుతుంది.

ప్రస్తుతం ఎన్నిక జరిగింది కేవలం క్రియాశీల సభ్యుల ద్వారా మాత్రమే. ఈ క్రియాశీల సభ్యుల సంఖ్యని కనీసం లక్షకి పెంచటం, పది లక్షల మంది సాధారణ సభ్యులని నమోదుచెయ్యటం, క్రిందిస్థాయి నుంచి పార్టీని బలపరిచే రీతిలో సంస్థాగత నిర్మాణం చేపట్టటం అత్యవసరం. పార్టీకి బలమున్న స్థానాలలో ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టి సమర్థులయిన నాయకులని ప్రజల ముందు పెట్టి, సాధారణ ఎన్నికలకి తయారవటం అత్యవసరం.

మేము మాత్రమే నీతిమంతులం, పవిత్రులం అన్న భావన ఓ సంస్థని, సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తుంది. ఎదుటి వారిలోని మంచిని గుర్తించటం, పరస్పర గౌరవంతో మెలగటం, అభిప్రాయభేదాలుంటే వాటిని సామరస్యంగా పరిష్కరించటం – ఇవి ప్రజాస్వామ్య సంస్కృతికి నిజమైన నిదర్శనాలు. గోరంతలు కొండంతలు చేయటం, ఎప్పుడూ ఎదుటివారిలో తప్పుల్ని వెదకటం, రంధ్రాన్వేషణ చేయటం ఎవరేపని చేసినా దాన్ని విమర్శించటమే పనిగా పెట్టుకోవటం ఇవి విజ్ఞుల లక్షణాలు కావు. ఈ సూత్రాలు పార్టీకి, సమాజానికి, దేశానికి వర్తిస్తాయి. గాంధీజీ చెప్పినట్లు " మనకి సత్వరం న్యాయం జరగాలంటే, ఎదుటి వారికి న్యాయం చెయ్యటానికి సిద్ధపడాలి." "తాబట్టిన కుందేటికి మూడేకాళ్ళు" అనే ధోరణి సామరస్యాన్ని ఐకమత్యాన్ని, సమాజహితాన్ని పెంచదు.

ఇక చివరగా, నీతివంతమైన రాజకీయాన్ని నడపటం, ప్రజాస్వామ్యబద్ధంగా నడిచే పార్టీలని నిర్మించటం మన దేశానికి అవసరం. ఈ పని ఒక్కరోజులో జరిగేదికాదు. మనం వేసే అడుగులు గతంతో పోలిస్తే, గణనీయంగా మంచి ఫలితాలని సాధించటం అవసరం. అంతేగాని, నూటికి నూరు మార్కులు రాలేదన్న కారణంగా నూటికి తొంభై మార్కులని తిరస్కరించటం అవివేకం. అలాగే అసలు లక్ష్యాలు, హేతుబద్ధమయిన విధానాలు, దేశ భవిష్యత్తుని సరయిన మార్గానపెట్టటం. సాధనలో పరిపూర్ణత్వం సాధించాలనే కోరికతో అసలు లక్ష్యాలనే మరిస్తే దేశానికి అంతకంటే నష్టం మరొకటి ఉండదు. తాత్కాలికమయిన అంశాల వేటలో లోక్‌సత్తా లక్ష్యాలని, దేశ భవిష్యత్తుకి కావలసిన మార్పులని, చేపట్టవలసిన విధానాలని మరవటం చరిత్ర క్షమించని పొరపాటవుతుంది.

లోక్‌సత్తా కేవలం ఓ సంస్థ మాత్రమే కాదు. అదో భావజాలానికి ప్రాతినిధ్యం ఇచ్చే ఉద్యమం. నీతివంతమయిన రాజకీయం, హేతుబద్ధ విధానాలు, దేశదీర్ఘకాలిక ప్రగతి, అందరికీ అవకాశాల ద్వారా వివక్ష లేని సమాజనిర్మాణం, చట్టబద్ధపాలన, సమాజంలో అన్ని వర్గాల మధ్య సుహృద్భావం సమన్వయం. ఈ లక్ష్యాలని కోరుకునే ప్రతి పౌరుడు లోక్‌సత్తాలో భాగమే. వారిలో కొందరే మన సభ్యులు సంస్థ, పార్టీ కేవలం ఈ లక్ష్యాలని సాధించటానికి మార్గాలు మాత్రమే.

పార్టీ సభ్యులు, అభిమానులు, మద్దతుదారులు – అందరూ పూర్తి ఐకమత్యంతో వ్యవహరిస్తారని, సంయమనాన్ని పాటిస్తారని, మన ఉమ్మడి లక్ష్యాల సాధన కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తారని మనసారా విశ్వసిస్తున్నాను. మీ అందరికీ, మీ కుటుంబాలకి విజయనామ సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

భవదీయ

(డా॥ జయప్రకాష్ నారాయణ్)

జాతీయ అధ్యక్షులు